క్లుప్తంగా

నేడు 'తోటపల్లి' నీరు విడుదల

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ద్వారా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి, ఆదివారం సాగునీరు విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు డీఈ టి.రఘునాథనాయుడు శనివారం తెలిపారు. ఈ సాగునీటి విడుదల కార్యక్రమానికి మంత్రి గుమ్మడి సంధ్యారాణి హాజరవుతున్నారన్నారు. ఈ మేరకు ఖరీఫ్ సీజన్‌కు కుడి ప్రధాన కాలువ ద్వారా 1.84 లక్షల ఎకరాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు.

అభివృద్ధి కార్యాచరణపై సమావేశం



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ధర్మారెడ్డి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధి కార్యాచరణపై సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి ఎస్‌డీసీ బి.ధర్మారెడ్డి.. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమాల్లో భాగంగా ఎదురవుతున్న సమస్యలు, ప్రజలకు ఏయే సేవలు అమలు చేస్తే మంచిదన్న వాటిపై వివరాలను ఎంపీడీవోలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ దుర్గాచక్రవర్తి, టీడబ్ల్యూ ఈఈ మణిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

పాలకొండ: లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన పోస్టర్లను సీఐటీయూ నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు మాట్లాడుతూ.. జీఓ 21ని ఉపసంహరించుకోవాలని కోరారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని.. గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి



సూచనలిస్తున్న ఎంఈవో సింహాచలం

గరుగుబిల్లి: బడిఈడు పిల్లలంతా బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంఈవో1 సామల సింహాచలం సూచించారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం పథకానికి అర్హులను గుర్తించి, కార్యాలయానికి జాబితా అందజేయాలన్నారు. ఈ నెల 10న జరిగే పేరెంట్స్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో2 కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

62 కేసుల రాజీ



కక్షిదారుల కేసుల వివరాలను న్యాయమూర్తికి వివరిస్తున్న న్యాయవాదులు

పాలకొండ రూరల్: స్థానిక సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో శనివారం చేపట్టిన జాతీయ లోక్‌అదాలత్‌లో పలు కేసులు రాజీ మార్గంలో పరిష్కరింపబడ్డాయి. మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు, న్యాయమూర్తి చందక హరిప్రియ సమక్షంలో కక్షిదారులు వివిధ కేసుల నుంచి బయటపడ్డారు. 62 కేసుల్లో ఇరువర్గాల మధ్య సానుకూల రాజీ కుదరగా మరో 342 కేసుల్లో చిక్కుకున్నవారు అపరాధ రుసుం చెల్లించారు.

పీ4 సర్వేపై సమీక్ష

జియ్యమ్మవలస రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో ఎంపీడీవో కె.ధర్మారావు శనివారం సమావేశమై పీ4 సర్వేపై సమీక్ష నిర్వహించారు. మండల వ్యాప్తంగా 1904 బంగారు కుటుంబాలను సర్వే ద్వారా ఎంపిక చేసి, వారి ఆర్థికాభివృద్ధికి దాతల ప్రణాళికలను రూపొందించాలని సూచించారు.

అటవీ హక్కులపై అవగాహన

భామిని: మండలంలోని బూర్జగూడలో ఆదివాసీ గిరిజనులకు అటవీ హక్కుల చట్టంపై వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. గిరిజనులు సాగు చేస్తున్న అటవీభూములు గిరిభూమిలో నమోదు కాకపోతే గ్రామసభ ద్వారా నియమించిన అటవీహక్కుల కమిటీ చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. కార్యక్రమంలో వెలుగు అసోసియేషన్ రిసోర్స్‌పర్సన్ ఎ.చిరంజీవిరావు, ఏసీఓ నాగరాజు, సీసీ పకీరు, గిరిజనులు పాల్గొన్నారు.



పొలం దున్నుతుండగా నేలలో నుంచి బయటకు వచ్చిన పురుగులను తింటున్న పక్షులు

పంటలకు ఆప్తమిత్రులు.. పక్షులు

- పంటల సంరక్షణలో పక్షులదే కీలకపాత్ర
- క్రిమికీటకాలు, వ్యాధుల నియంత్రణ
- విపత్కుల్యం కాని పంటల దిగుబడి

గుమ్మలక్ష్మీపురం:

పంటల సాగులో విరివిగా వినియోగిస్తున్న రసాయనిక ఎరువులు, క్రిమిసంహారకాల వల్ల తెలియకుండానే అనేక దుష్ఫలితాలు ఎదురవుతున్నాయి. వాటిని వాడటం ద్వారా నేలలోని మిత్ర పురుగులు, విషపూరిత ఉత్పత్తులు తింటున్న పక్షులు అనారోగ్యం బారినపడి చనిపోతున్నాయి. పంటల సంరక్షణకు ఉపయోగపడే పక్షి జాతులు అంతరించడం జీవ వైవిధ్యానికి చేటు కలిగించే అంశం. పంటలకు హాని కలిగించే క్రిమికీటకాలు, చనిపోయిన పక్షి, జంతు కళేబరాలను తినడం ద్వారా పక్షులు పంటలకు ఆప్తమిత్రులుగా ఉంటున్నాయి. తద్వారా ఆరోగ్యవంతమైన పంట, నాణ్యమైన దిగుబడి సాధ్యమవుతున్నాయి. ఈ విషయాలపై మండల వ్యవసాయాధికారి పి.శంకరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి..

అరక దున్నే సమయంలో..

వ్యవసాయ పనుల ప్రారంభంలో చేసే పొలం దుక్కి పనుల్లో అరక(నాగలి)తో దున్నే సమయంలో ఎక్కువగా పక్షులు నేలపై వాలి దున్నినప్పుడు మట్టిలో నుంచి బయటకు వచ్చిన పురుగులను తింటాయి. ఇది పక్షుల సహజసిద్ధమైన పని అయినప్పటికీ అది పరోక్షంగా రైతుకు ఉపకరిస్తుంది. పంట నేలలోని హానికరమైన క్రిములు, కీటకాలను పక్షులు ఆహారంగా తీసుకోవడం వల్ల తర్వాత వేసే పంటకు ఎటువంటి నష్టం ఉండదు.

పక్షులు వాలడానికి పందిరి..

పైరు సంరక్షణకు ఉపయోగపడే పక్షుల కోసం పంటపొలం వద్దే పక్షులు వాలేందుకు వీలుగా పందిరి వేసుకోవాలి. అలాగే పొలంగట్ల వెంబడి కంది, వేరుశనగ, మినుము, పెసర వంటి పంటలు వేసుకుంటే పక్షులు వాలేందుకు ఆస్కారం ఉంటుంది. పక్షులు చనిపోకుండా ఉండేందుకు రైతులు రసాయనిక ఎరువులు వాడకుండా జీవరసాయన ఎరువులు వాడాలి. ఒకవేళ విచక్షణా రహితంగా రసాయనిక ఎరువులు వాడితే అదే సమయంలో పైరుపై వాలే పక్షులు చనిపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో రైతులంతా తగిన జాగ్రత్త వహిస్తూ పక్షులను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

సమావేశానికి తరలివెళ్లిన నాయకులు



మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణితో జెడ్పీ వైస్‌చైర్మన్ బాపూజీనాయుడు తదితరులు

గరుగుబిల్లి: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన వైఎస్సార్ సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి కురుపాం నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. ఉమ్మడి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, మండల కన్వీనర్ కేతిరెడ్డి అచ్యుతరావుల ఆధ్వర్యంలో ప్రతి మండలం నుంచి స్వచ్ఛందంగా నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లడం విశేషం. ఇలా వెళ్లిన వారంతా తమ అభిమాన నాయకులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, మాజీ ఉపముఖ్యమంత్రి పుష్పశ్రీవాణిలతో ఫొటోలు దిగి తమ అభిమానం చాటుకున్నారు.

గంగారేగువలసలో అధికారుల బృందం పర్యటన



గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దారు సత్యనారాయణ తదితరులు

కొమరాడ: మండలంలోని గంగారేగువలస గ్రామంలో అధికారుల బృందం శనివారం పర్యటించింది. గ్రామంలో క్రమక్రమంగా కేన్సర్ రోగులు బయటపడుతున్న నేపథ్యంలో తహసీల్దారు సీహెచ్ సత్యనారాయణ, పొల్యూషన్ అధికారులు కలిసి గ్రామానికి వెళ్లి, గ్రామస్తులు కేన్సర్ వ్యాధి బారినపడడానికి గల కారణాలను అన్వేషించారు. నీరు, గాలి కాలుష్యాలకు సంబంధించి, పరీక్షలు చేస్తామని పూర్తిస్థాయి నివేదిక ఇస్తామని అధికారుల బృందం తెలిపారు. అయితే తప్పుడు నివేదికలు ఇస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి, ఇరిగేషన్ ఏఈ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల బియ్యంపై దర్యాప్తు



వీరఘట్టం గర్ల్స్ హైస్కూల్‌లో బియ్యం పరిశీలిస్తున్న ఎంఈఓ ఆనందరావు, పౌరసరఫరాల శాఖ అధికారులు

వీరఘట్టం: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకానికి సరఫరా చేసిన బియ్యంలో పురుగులు ప్రత్యక్షమవడంతో పత్రికల్లో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో పౌరసరఫరాల శాఖ టెక్నికల్ సిబ్బంది, విద్యాశాఖాధికారులు స్పందించారు. మండలంలోని సంత-నర్సిపురంలోని మోడల్ ప్రైమరీ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వీరఘట్టం గర్ల్స్ హైస్కూల్‌ను శనివారం సందర్శించి బియ్యాన్ని పరిశీలించారు. పురుగులు ఉండడంతో విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఎంఈఓ ఆనందరావు, పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు.

సందర్శన



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఏపీఓ చిన్నబాబు

సీతంపేట: మండలంలోని ముత్యాలు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ ఏపీఓ జి.చిన్నబాబు శనివారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ముచ్చటించారు. చదువులో వెనుకబడిన వారిపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం భోజనశాలను సందర్శించి మెనూ పరిశీలించారు.

ప్రమాదకరంగా చెట్ల కొమ్మలు..



వీరఘట్టం - పాలకొండ సీఎస్పీ రహదారిలో రేగులపాడు జంక్షన్ నుంచి తూడి వరకు ఉన్న రహదారికిరువైపులా చెట్ల కొమ్మలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

– వీరఘట్టం

నిర్లక్ష్యానికి నిదర్శనం..



వరుస వర్షాలకు పట్టణంలో పారిశుధ్యం క్షీణించింది. ప్రజారోగ్య రక్షణపై దృష్టి సారించాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. పట్టణంలోని చీమలవీధిలో పారిశుధ్యం మరీ దారుణంగా ఉంది. ఈగలు, దోమలు వృద్ధి చెంది అంటురోగాలు ప్రబలుతున్నాయి. అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. – పాలకొండ రూరల్

దత్తత తీసుకోవాలి..

భామిని: గ్రామాల్లో జరిపిన పీ 4 సర్వేలో గుర్తించిన బంగారు కుటుంబాలను ఆర్థికంగా తీర్చిదిద్దడానికి దత్తత తీసుకొనేలా మ్యాచింగ్ చేపట్టాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ శనివారం నిర్వహించిన సెట్ కాన్ఫరెన్స్‌లో సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. బంగారు కుటుంబాలను అనుసంధానం పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల పరిషత్ టైపిస్ట్ గోపీకృష్ణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కణితి తొలగింపు

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఓ మహిళ గర్భాశయం నుంచి రెండు కిలోల కణితి శస్త్రచికిత్స చేసి తొలగించినట్లు సూపరింటిండెంట్ బి. శ్రీనివాసరావు తెలిపారు. వంగరకు చెందిన ఆర్. రాధమ్మ ఇటీవల కడుపునొప్పితో బాధపడుతూ ఆస్పత్రిలో చేరింది. గైనకాలజిస్ట్ ఉషారాణి, జనరల్ సర్జన్ జయకృష్ణ, మత్తు డాక్టర్ రత్నాకర్ శనివారం శస్త్రచికిత్స చేసి కణితి తొలగించారు. రాధమ్మ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారు.

9న దేశవ్యాప్త సమ్మె

జియ్యమ్మవలస రూరల్: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన చేపట్టే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు ఓ ప్రకటనలో శనివారం కోరారు. ఈ మేరకు ఆయన సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు.

డిప్యూటీ ఎంపీడీవోగా హరిప్రసాద్

జియ్యమ్మవలస రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా హరిప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీవో ధర్మారావు తెలిపారు.

ఆర్‌ఏ ధ్రువీకరణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న నేహా

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి జట్టు ఆశ్రమంలో వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి, ఆర్‌ఏ(రైన్ ఫారెస్ట్ అలయన్స్) ధ్రువీకరణపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. రెండు రోజులుగా జరుగుతున్న ఈ కార్యక్రమానికి రైన్ ఫారెస్ట్ అలయన్స్ అసోసియేషన్ ట్రైనింగ్ నెట్‌వర్క్ రిసోర్స్‌పర్సన్ ఎస్.నేహా హాజరై, ఆర్‌ఏ ధ్రువీకరణ పొందేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పండించే పంటలకు ఆర్‌ఏ ధ్రువీకరణ రావాలంటే ఏడు ప్రామాణికాలు పాటించాలని తెలిపారు. ఆర్‌ఏ ధ్రువీకరణ ఉంటే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 150 దేశాల్లో వ్యవసాయో త్పత్తులను విక్రయించుకునేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో జట్టు ట్రస్టు ఈడీ సరోజ్ ప్రహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



షేకుపాడు గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న కురుపాం ఎస్‌ఐ నారాయణరావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని కురుపాం ఎస్‌ఐ పి.నారాయణరావు సూచించారు. కురుపాం మండలంలోని షేకుపాడు, రంగుపురం, దండుసూరగూడ గ్రామాలను శనివారం సందర్శించిన ఆయన.. సైబర్ నేరాలు-వాటి బారినపడకుండా పాటించాల్సిన జాగ్రత్తలు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను గ్రామస్తులకు వివరించారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్‌కాల్స్ వస్తే లిఫ్ట్ చేయవద్దని, వారి మెసేజ్‌లకు రిప్లై ఇవ్వవద్దని, ఓటీపీ చెప్పవద్దని తెలిపారు. అలాగే గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం, సిగరెట్ వంటి మత్తు పదార్థాలను తీసుకోవద్దన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

అధికారులే కీలకం..



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్, తదితరులు

పాలకొండ రూరల్: మండలాభివృద్ధిలో అధికారులు కీలకంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆకాంక్షించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డితో కలసి అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..బదిలీపై వచ్చిన వారు శాఖపరంగా అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి, పనులు, వాటి పురోగతిపై సమీక్షించారు. ఎంపీపీ బి.భాను ప్రజా ప్రతినిధుల తరఫున పలు అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి డాక్టర్ శివ్వాల మన్మధరావుతో పాటు పలువురు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథ స్వామి మారు రథయాత్ర



భామిని: బత్తిలిలో జగన్నాథ స్వామి మారు రథయాత్ర

జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. చివరి రోజు మారు రథయాత్ర నిర్వహించారు. పాలకొండ, వీరఘట్టం, భామిని, తదితర ప్రాంతాల్లో చేపట్టిన రథయాత్రలో వేలాది మంది భక్తులు పాల్గొని రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా పోలీసులు అన్ని ఏర్పాట్లు చేశారు. పాలకొండలో డీఎస్పీ ఎం.రాంబాబు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. వీరఘట్టంలో ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ దంపతులు గుడించా మందిరంలో ఉన్న జగన్నాథ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి ఉత్సవ విగ్రహాలను అర్చకుడు లింగరాజ్‌రథో రథంపైకి ఎక్కించారు. అనంతరం ఊరేగింపుగా ప్రధాన ఆలయం వద్దకు తీసుకెళ్లారు.

– పాలకొండ/వీరఘట్టం/భామిని



పాలకొండ: నిజరూప దర్శనంలో జగన్నాతస్వామి



వీరఘట్టం: ఆకట్టుకుంటున్న జగన్నాథుడి ముగ్గు

సమస్యలు చెబితే పట్టించుకోరా..?

- మంత్రి శ్రీనివాసరావును నిలదీసిన మహిళలు
- తుమరాడలో 'సుపరిపాలన తొలి అడుగు'



మంత్రి శ్రీనివాసరావుకు సమస్య వివరిస్తున్న సరోజిని

పాలకొండ రూరల్: సమస్యలు చెబుతుంటే పట్టించుకోరా.. అని రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాసరావును మహిళలు నిలదీశారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంత్రి శ్రీనివాసరావు, తదితరులు పాలకొండ మండలం తుమరాడ గ్రామంలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా తమ ఏడాది పాలనలో చేపట్టిన పనులను వివరిస్తూ, కరపత్రాలు పంచుతూ ముందుకెళ్తుండగా.. చినకాపువీధి వద్ద మహిళలు వి.సరోజిని, పి.జయమ్మ, బి.సత్తమ్మ, తదితరులు పలు సమస్యలను ఏకరవు పెట్టారు. కుళాయిలు పని చేయడం లేదని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మీరు వచ్చారని తాత్కాలికంగా బాగుచేశారే తప్ప శాశ్వత పరిష్కారం చేపట్టలేదన్నారు. మంత్రి స్పందించేలోగా పక్కనే ఉన్న టీడీపీ శ్రేణులు కలుగజేసుకుని నచ్చకపోతే నచ్చనట్లే ఉండాలని అసహనం వ్యక్తం చేశారు. దీనికి మహిళలు స్పందిస్తూ తమకు నచ్చకపోవడం కాదని.. ఉన్న సమస్యే కదా అంటుండగా.. మంత్రి, తదితరులు ముందుకు కదిలారు. దీంతో మహిళలు సమస్యలను గట్టిగా చెప్పేందుకు ప్రయత్నించగా.. టీడీపీ నాయకులు నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు. అయినప్పటికీ మహిళలు వారి వెంట వెళ్తూ రహదారి, తాగునీటి సమస్యలను వివరించే ప్రయత్నం చేశారు.

మంత్రి దృష్టికి...

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పడాల భూదేవి నేతృత్వంలో రామమందిరం వద్ద జరిగిన సమావేశంలో స్థానికులు పలు సమస్యలను మంత్రి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా తవ్విన రోడ్లను బాగు చేయాలని కోరారు. తాగునీటి సమస్య ఉన్నందున మరో రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేయాలని సర్పంచ్ పి. శోభారాణి కోరారు. సభలో ఉన్న పలువురు మహిళలు తమకు నెలకు రూ. 15 వందలు ఇస్తామన్నారు..ఎప్పుడిస్తారో అంటూ గుసగుసలాడారు. మంత్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దశల వారీగా అన్ని సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. తాగునీటి సమస్యను కచ్చితంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వర్గపోరు..

కార్యక్రమాన్ని పర్యవేక్షించాల్సిన నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూదేవిని పక్కన పెట్టి టీడీపీలో ఓ వర్గం అంతా తామే అన్నట్లు కార్యక్రమాన్ని నడిపించారు. ప్రజలతో మమేకమైన సమయంలో కూడా వారే వినతిపత్రాలు అందుకోవడం.. సభలో ప్రసంగించడం జరిగింది. భూదేవిని మాట్లాడమని మంత్రి ప్రోత్సహించకపోవడంతో ఆమె వర్గీయులు అసహనం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో తొలిసారిగా మంత్రి సమక్షంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పాల్గొనలేదు.

శాకంబరిగా అన్నపూర్ణాదేవి

పాలకొండ రూరల్: పట్టణంలోని కాశీవిశ్వేశ్వర ఆలయంలో కొలువైన అన్నపూర్ణాదేవి శనివారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకుడు జోష్యుల ఆంజనేయశర్మ అమ్మవారికి కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. సామూహిక అర్చనలతో పాటు పుణ్య జలాలతో అమ్మవారికి అభిషేకాలు చేపట్టారు. ఈ నెల 8, 9 తేదీల్లో ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం కోటదుర్గమ్మ దేవస్థానంలో ఈ వేడుకులు జరగనున్నాయి.



శాకంబరిగా పూజలు అందుకుంటున్న అన్నపూర్ణాదేవి